
ఆంధ్రజ్యోతి



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.6 ; కనిష్ఠం 23.1

కామారెడ్డి
జిల్లా వార్తలు


5


మంగళవారం 16 జూలై 2024

పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్, జూలై 15: సదాశివనగర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, తెలుగు, హిందీ టీజీటీ పోస్టులకు పీజీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 18న డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వేతనం నెలకు రూ.18వేలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

సందిగ్ధంలో స్థానిక ఎన్నికలు!





- 'స్థానిక' ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం
- బీసీ రిజర్వేషన్లపై స్పష్టత కరువు
- కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించే అవకాశం
- ఆశావహుల్లో నెలకొన్న ఉత్కంఠ
- ఇప్పటికే ముగిసిన సర్పంచ్, జడ్పీటీసీ,ఎంపీపీల పదవీకాలం
- కొనసాగుతున్నప్రత్యేక అధికారుల పాలన
- జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, 22 జడ్పీటీసీ, ఎంపీపీలు
- కొత్తగా మరో మూడు మండలాల ఏర్పాటు

కామారెడ్డి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అప్పట్లో సీఎం రేవంత్‌రెడ్డిప్రకటించారు. కాని ఆ దిశగా ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. గడువుతీరిన గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా కనిపించడం లేదు. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవికాలం ముగిసి ఇప్పటికే 5 నెలలు గడిచిపోయాయి. 2024 ఫిబ్రవరి 1వ తేదితో గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగా పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మండల ప్రజాపరిషత్ పాలకవర్గాల గడువు ఈ నెల 3తో ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌లను యథాతదంగా కొనసాగిస్తారా లేదా సవరణచేసి అమలుచేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ రిజర్వేషన్‌లు మార్చి అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తే ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా ఆధారంగా ఎస్‌టీ, ఎస్‌సీ, బీసీ ఓటర్ల వివరాలను సేకరిస్తారా లేక బీసీ కులగణన ఆధారంగా ఖరారుచేస్తారా అనేది తెలియాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకై బీసీ కమీషన్ నివేదిక కీలకం కానుంది. పంచాయతీలు, మండల, జడ్పీ ప్రజా పరిషత్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ల వాటా ఏమేర ఉండనుందనేది రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

జిల్లాలో 526 జీపీలు, 22 మండలాలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో మొత్తం 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 22 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. అయితే గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో పలుకొత్త గ్రామపంచాయతీలు సైతం ఏర్పాటు అయ్యాయి. జీపీలే కాకుండా మూడు కొత్త మండలాలైన డోంగ్లి, పల్వంచ, మహ్మద్‌నగర్‌లను ఏర్పాటుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే పాత జీపీలు, మండలాలతోపాటు కొత్తగా ఏర్పడిన వాటిలోను నిర్వహించనున్నారు. ఇప్పటికే సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. వీరి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించి పాలన నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

ఐదేళ్ల క్రితమే కొత్త చట్టం

పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను పదేళ్ల పాటు అమలు చేసేలా చట్టంలో మార్పు తీసుకువచ్చారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 2019 జనవరిలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగగా మూడువిడుతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. అదే ఏడాది ఏప్రిల్,మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే స్థానిక ఎన్నికలకు సంబంధించిన సన్నాహాల్లో అధికారులు నిమగ్నం అయ్యారు. గ్రామపంచాయతీలు, వార్డులకు సంబంధించిన సమాచారం సిద్ధంచేశారు. ఓటింగ్ కోసం అవసరమయ్యేపోలింగ్ బాక్స్‌లు కూడా సిద్ధం చేసుకున్నారు.

50 శాతానికి లోబడే రిజర్వేషన్లు

గత పంచాయతీ ఎన్నికల్లో 2011 జనాభాను పరిగణలోకి తీసుకుని ఎస్‌టీ, ఎస్‌సీలకు రిజర్వేషన్‌లను నిర్ధారించారు. బీసీలకు మాత్రం 50 శాతం కోటా మించరాదనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వీరికి సర్పంచ్ పదవులను రిజర్వ్ చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు 50 శాతానికి మించరాదనే న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఎస్‌సీ, ఎస్‌టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కల్పించగా 50శాతం మించకుండా అమలుచేస్తున్న రిజర్వేషన్‌లలో బీసీలకు ఈసారి 22.78 శాతం మాత్రమే రిజర్వేషన్‌లు దక్కాయి. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వ్ చేయగా 2019 ఎన్నికల్లో మాత్రం 22.78 శాతం రిజర్వేషన్‌లు అమలుచేశారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు?

లోక్‌సభ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావించిన బీసీ రిజర్వేషన్‌ల అంశంపై తెల్చలేకపోవడం, కులగణన డిమాండ్ తెరపైకి రావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పంచాయతీ, మండల, జడ్పీ ప్రజాపరిషత్ పాలక వర్గాల పదవికాలం ముగిసింది. స్థానిక సంస్థలకు 5 ఏండ్ల పదవికాలం ముగియగానే కొత్తపాలకవర్గాలు కొలువుదీరే విధంగా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. కాగా బీసీ రిజర్వేషన్‌లు అంశం తెలకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటిల పాలకవర్గాల పదవికాలం మరో 6 నెలల్లో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరిలో మున్సిపాలిటిలు,ఆతర్వాత పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది.

రిజర్వేషన్లపైనే చర్చ

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్‌లు ప్రధాన అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన పంచాయతీ రాజ్ చట్టం ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్‌లు పదేళ్లపాటు వర్తిస్తాయని పేర్కొంది. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత రిజర్వేషన్‌ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా లేక రిజర్వేషన్‌లో ఏమైన మార్పులు చేస్తుందా అనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్‌లు కేటాయించే అవకాశంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీ గణన అంశంపై తెరపైకి వచ్చిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందనేది స్పష్టం అవుతుంది.





డెడ్ స్టోరేజీకి చేరిన కౌలాస్‌నాలా ప్రాజెక్టు

అడుగంటిన కౌలాస్‌నాలా నీటి నిల్వలు

పెద్దకొడప్‌గల్, జూలై15: కౌలాస్ నాలాప్రాజెక్ట్‌లో నీటి మట్టం అడుగంటింది. జుక్కల్ మండలంలోని పలు గ్రామాలతోపాటు, బిచ్కుంద మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్ట్‌లో నీరు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంది. గత సంవత్సరం కూడా ఈ ప్రాజెక్ట్‌కు నీరు ఆలస్యంగా రావడంతో ఆయకట్టు రైతులు ఆలస్యంగా పంటలు సాగు చేశారు. గత సంవత్సరం నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరదనీరు వచ్చి నిండిన తరువాత కౌలాస్‌కు వరదనీరు రావడంతో పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండిపోయింది. అయితే ఈ సారి కౌలాస్‌నాలా ప్రాజెక్ట్ ఎగువ భాగంలో భారీ వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్ట్‌లోకి చుక్కనీరు రాలేదు. దీంతో ప్రాజెక్ట్‌లోకి నీరు ఎప్పుడు వస్తుందో తాము పంటలు ఎప్పుడు సాగు చేయాలో తెలియడం లేదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కాగానే గతంలో ఎప్పుడు చూసిన కౌలాస్‌నాలాలోకి భారీగా వరద చేరి ప్రాజెక్ట్ నిండేదని, గత రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో ప్రాజెక్ట్‌లోకి నీరు రావడం ఆలస్యం అవుతుందని, దీంతో పంట సాగు ఆలస్యం అవుతుందని రైతన్నలు వాపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

• కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇతర జిల్లా అధికారులు



ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు

కామారెడ్డిటౌన్, జూలై15: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయొద్దని, ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కార మార్గాలను అన్వేషించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల ద్వారా స్వీకరించారు. ప్రధానంగా విద్య, వైద్య, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్‌లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు తదితర అంశాలకు సంబంధించి 127 ఫిర్యాదులు అందాయి. ఇందులో కలెక్టరేట్ 5,రెవెన్యూ 74, ఎంప్లాయిమెంట్ 6, మైనార్టీలు 1, డీపీఓ 6, ఎలక్ట్రిసిటి 2, ఎక్సైజ్ 2, ఫారెస్ట్ 1, హౌజింగ్ 1, మున్సిపల్ 10, డీఆర్‌డీఓ 8, ఎస్‌పీ 5, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు 5, హ్యూమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ 1 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణితోపాటు సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ క్షుణంగా పరిశీలించి పరిష్కరించదగినవి వెంటనే పరిశీలించాలని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ మెప్మా ఆఫీస్‌లో పనిచేసే ఆర్‌పీలు కామారెడ్డి మయూరి ఎస్‌ఎల్‌ఎఫ్‌లో వెంకటేశ్వర మహిళా సంఘం మొదటి లీడర్ ముదాం రాజేశ్వరీ ప్రతీనెల 9మంది సభ్యులు చెల్లించిన లోన్ డబ్బులను తన సొంత అవసరాలకు వాడుకుందని ఫిర్యాదుచేశారు. ఆ సంఘాన్ని చూసే ఆర్‌పీ లావణ్య, బ్యాంకువారు డబ్బులు కట్టమని అడిగితే కట్టనని గొడవ చేసిందని, దీంతో మెప్మా నుంచి 12న రికవరీకి వెళ్తే ఆమె భర్త ముదాంశ్రీనివాస్ అసభ్యకమరమైన మాటలతో కర్రతో దాడిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పీడీ చర్యలు తీసుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పలువురు పెద్దసంఖ్యలో ధరణి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

గురుకుల పాఠశాలలో నల్లాలు ఇలా..





నాణ్యత లేని బంగారం అమ్మితే చర్యలు: సీఐ

కామారెడ్డి టౌన్, జూలై 15: నాణ్యత లేని బంగారం అమ్మితే చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని జేపీఎన్ రోడ్డులో ఉన్న దేవి జ్యూవెలర్స్ యాజమాని సిరిపురం ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14న భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన మట్టి శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తికి మూడు గ్రాముల బంగారు ఉంగరాన్ని ప్రకాష్ ఇచ్చాడని తెలిపారు. బంగారు ఉంగరం నాణ్యత తక్కువగా ఉన్నందనే అనుమానం మేరకు హైదరాబాద్‌లో శ్రీకాంత్ రెడ్డి చెక్‌చేయించగా అది ప్యూర్ బంగారం కాదని రిపోర్టు ఇచ్చారని తెలిపారు. నాణ్యతలేని బంగారం అమ్మినందుకుగాను శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బంగారం అమ్మే వ్యక్తులకు, జువెల్లరి షాప్ యాజమానులు ఎట్టి పరిస్థితుల్లో కూడా దొంగబంగారాన్ని అమ్మకూడదని, కొనేవారు చెక్ చేసుకుని కోనాలని, ఏదైనా అనుమానం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



దుకాణం వద్ద విచారణ చేపడుతున్న పోలీసులు

భిక్కనూరు బీసీ గురుకులంలో నిత్యం భయం భయం!

- అధ్వానంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఒకటి, రెండుకు బయటకు వెళ్తున్న విద్యార్థులు
- బయటికెళ్లి విష కీటకాల బారిన పడుతున్న వైనం
- ఎమ్మెల్యే, జిల్లా అధికారులు సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల వేడుకోలు

భిక్కనూరు, జూలై 15: భిక్కనూరు బీసీ గురుకులంలో విద్యార్థులు భయం భయంగా గడుపుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు కాలకృత్యాలకు బయటికెళ్లి విషకీటకాల బారినపడుతున్నారు. పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల అధ్వానంగా తయారయ్యాయి. నల్లా ఉంటే డోరు లేదని, డోరు ఉంటే మరుగుదొడ్డి లేదని.. శుభ్రత లేక కంపుకొడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి, రెండుకు వెళ్లలేక విద్యార్థులు బయటకు వెళ్తున్న పరిస్థితి భిక్కనూరు మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొంది.

భిక్కనూరు గురుకుల వసతిగృహంలో విద్యార్థులు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు సరిగ్గా లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాలకృత్యాలకు వెళ్లాలంటే పాఠశాల సమీపంలోని కుంట వద్దకో లేక బాటిల్‌ను పట్టుకుని పాఠశాల గోడ దూకి బయటకు వెళ్తున్నారు. ఈ సమస్యలను ఎవరికైనా చెబితే చెప్పిన విద్యార్థులను కొందరు సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యలతోపాటు వసతిగృహం వద్ద కోతులు తిష్టవేయ్యడంతో పాటుగా ఎక్కడా చూసిన పిచ్చిచెట్లు మొలకెత్తి వనంలా కన్పిస్తోంది. కోతులు వసతిగృహం లోపల గదుల్లోకి రావడంతో చిన్నపిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉండటంతో దోమలు బెడద ఎక్కువగానే ఉంది.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి



పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న అక్షిత్

• మరుగుదొడ్లలో నీటి వసతి కరువు

పాఠశాలలో విద్యార్థులు ప్రతీరోజు వసతిగృహం వద్ద ఉన్న నల్లాల వద్దే స్నానం చేస్తున్నారు. ఈ నల్లాలే స్నానానికి, భోజనం చేసిన అనంతరం చేతులు కడుక్కోవడానికి, వంట సిబ్బంది పాత్రలు కడగడానికి అన్నింటికీ దిక్కు అవుతోంది. ఈ నల్లాల వద్ద సైతం అపరిశుభ్రం తాండవం చేస్తోంది. పాకూరు పట్టిన వరండా, చెత్తచెదారంతో అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్డి కూడా సరిగా లేదు. నల్లాలు, డోర్లు విరిగిపోయి, సింక్‌లు పగిలిపోయి ఉన్నాయి. అందులో మలవిసర్జనకు పోవాలంటే ఎంతో సాహసం చేయాల్సిందే. దీంతో గత్యంతరం లేక ఎవరికీ చెప్పుకోలేక విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు బయటకు వెళ్తున్నారు.

• విసపురుగుల బారిన పడుతున్న విద్యార్థులు

మరుగుదొడ్లు సరిగా లేక మల, మూత్ర విసర్జనకు పగలు, రాత్రి బయటకు వెళ్తున్నారు. పాఠశాల సమీపంలో ఉన్న కుంట వద్దకు కొందరు వెళ్తుంటే మరికొందరు పాఠశాల గోడ దూకి బయటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు విషపురుగుల బారిన పడుతున్నారు. గత శుక్రవారం మూత్ర విసర్జకు వెళ్లిన ఏడో తరగతి చదువుతున్న అక్షిత్ పాముకాటుకు గురయ్యాడు. సిబ్బంది అప్రమత్తమై ఆసుపత్రికి తీసుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆ విద్యార్థి కామారెడ్డిలో చికిత్స పొందుతున్నాడు.

• ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించాలి విద్యార్థుల వినతి..

పాఠశాలలోని పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు, కోతుల బెడద, ఇతర సమస్యలతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాఠశాలలోని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి ఈ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జూలై 15 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటిసారిగా బాన్సువాడకు విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొయ్యగుట్ట చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని కొయ్యగుట్ట చౌరస్తా వద్ద అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం కాసుల బాల్‌రాజ్ ఎమ్మెల్యే పోచారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరి ంచారు. కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పని ఇక ఖేల్ ఖతం దుకాణం బంద్ అయిందని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 13 మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై 15 : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు సోమవారం 14వ రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 101 మంది విద్యార్థులకు గాను 98 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, జూలై 15 : విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రెటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1, 3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7, 9వ సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో 104మంది విద్యార్థులకు గాను 98 మంది పరీక్షకు హాజరయ్యారని ఆరుగురు విద్యార్థులు గైర్హాజ రయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు.

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం

డిచ్‌పల్లి, జూలై 15 : మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని మొక్కల పెంపు అన్ని గ్రామాల్లో ఇళ్ల ముందు మొక్కలు నాటి పర్యా వరణ పరిరక్షణకు చేయూత అందించాలని ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, నడిపల్లి ఈవో నిట్టుకిషన్ రావులు కోరారు. సోమవారం గాంధీ నగర్ కాలనీలో 2వేల మొక్కలను ఇంటింటికి 3 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. మొక్కలు నాటడమే గాకుండా వాటి సంరక్షణ కూడా చూసు కోవాలని కోరారు.

'నిత్యావసర సరకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలి'

డిచ్‌పల్లి, జూలై 15 : గత ఐదు నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని, ఇక ముందు మధ్యాహ్న భోజనంకు సంబంధించిన కోడిగుడ్లు, నిత్యవసర సరకులు ప్రభుత్వమే అందించాలని, మధ్యాహ్న భోజన ప్రతినిధుల రాష్ట్ర ఉపాధ్యక్షు డు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాధికారి కార్యాలయంలో కార్మికులతో కలిసి ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు 10వేల రూ.వేతనంతో పాటు ఈ ఎస్‌ఐ, పీఎఫ్ సౌకార్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సరకులు ఇస్తేనే తాము వంట చేస్తామని లేనిచో తమ సరఫరా చేసే స్థితిలో లేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బాలరాజు, సాయిలు, లక్ష్మీ, సులోచన, కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌కు సన్మానం

డిచ్‌పల్లి, జూలై 15 : గతకొన్నేళ్లుగా ధర్మారం (బీ) గురుకుల కళా శాల ప్రిన్సిపాల్‌గా, కో-ఆర్డినేటర్‌గా అత్యుతమ సేవలు అందించిన సంగీత మేడంను గురుకుల పేరెంట్స్ కమిటీ సభ్యులు సోమవారం సన్మానించి అభినందించారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన సంగీత ఈ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, నర్సయ్య, శ్రీనివాస్, నర్సయ్య, దీపక్, బూస బాలరాజు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన విక్టోరియ మేడం అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

● సీడీపీవో సునంద

మద్నూర్, జూలై 15 : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తుందని, అంగన్‌వాడీ వర్కర్లు రెండున్నర ఏళ్ళ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని మద్నూర్ ప్రాజెక్టు అధికారిణి సీడీపీవో సునంద సూచించారు. మండల కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో ర్యాలీ నిర్వహించి చిన్నారుల చేత మొక్కలను నాటించారు. మండల కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో ర్యాలీ నిర్వహించి చిన్నారుల చేత మొక్కలను నాటించారు. రెండున్నర సంవత్సరాల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించడానికి లక్ష్యంగా వర్కర్లు పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కవిత, ఏఎన్‌ఎం స్వప్న తదితరులు ఉన్నారు.

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవీపేట, జూలై 15 : రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అన్వేష్‌రెడ్డికి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగా మండల మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్‌కే.బాబులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ఆర్మూర్ టౌన్ : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అన్వేష్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. హైదరాబా ద్‌లోని అన్వేష్‌రెడ్డిని ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి, బండారిప్రసాద్ పాల్గొన్నారు.

మోర్తాడ్ : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అన్వేష్‌రెడ్డిని సోమవారం మోర్తాడ్ మండల కాంగ్రెస్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మోర్తాడ్ వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు సుదీర్‌నాయక్, మండల రైతు సంఘం అధ్యక్షుడు బద్దం రాజశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్, కొమిరె శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : అన్వేష్‌రెడ్డిని ఆలూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఇటీవల సహకార యూనిట్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మానాల మోహన్‌రెడ్డిని కూడా కలిసి సన్మానించారు. ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్, జితేందర్ ఉన్నారు.

ఏర్గట్ల : సుంకేట్ అన్వేష్‌రెడ్డిని సోమవారం మండలంలోని కాంగ్రెస్ నా యకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, బద్ధం లింగా రెడ్డి, కొరిపెల్లి లింగారెడ్డి, వెంకట్ రెడ్డి, రేండ్ల రమేష్ పాల్గొన్నారు.

చేపూర్‌లో వివాదాస్పద రోడ్డు స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ



చేపూర్‌లో వివాదాస్పద రోడ్డును, స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై14 : చేపూర్ గ్రామంలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న వివాదస్పద రోడ్డు స్థలాన్ని సోమవారం ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. జంబిపూజకు గ్రామదేవతల ఆలయాలకు వెళ్లే రోడ్డును విజయ్ అనే వ్యక్తి కబ్జా చేశాడని గ్రామస్థులు అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ బస్వారెడ్డి, సీఐ రవికుమార్ చేపూర్ గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని గ్రామస్థులు ఏసీపీకి చూపించారు. గత ఏన్నో ఏళ్లుగా జంబిపూజకు, గ్రామదేవత ఆలయాలకు వెళ్లే రోడ్డును కబ్జా చేశారని గ్రామస్థులు ఏసీపీ వివరించారు. సర్వేయర్‌తో కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని, పరిసరాలను సర్వే చేయించారు. మూడు రోజుల్లోనే ఆర్డీవో, తహసీల్దార్‌ల సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్థులకు ఏసీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, వీడీసీ సభ్యులు శ్రీకాంత్, రుక్మాజీ, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నాగరాజు

ఆర్మూర్‌టౌన్ , జూలై 15 : యూఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యునిగా సిద్దాల నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యరంగ సమస్యలపై పోరాడుతానని, రాష్ట్ర కమిటీ నాపై నమ్మకం ఉంచి కమిటీ సభ్యునిగా ఎన్నుకోవడంపై ధన్యవాదాలు తెలిపారు.

ఒకటో వార్డులో బోరు పనులు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్ , జూలై 15 : మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు జిరాయత్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ బోరును మంజూరు చేసి సోమవారం బోరు పనులను ప్రారంభించారు. జిరాయత్ నగర్‌లో ప్రజలు నీటి సమస్యతో బాధపడుతున్నారని తెలియడంతో సోమవారం బోరుబావిని వేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఇంతియాజ్, రహమన్, ఫయాజ్, అతిక్, ఇందరపు రాజు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థిని



బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థి ధృవ

పెర్కిట్, జూలై 15 : ఆర్మూర్ పట్టణం మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి దాసరి ధృవ తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించినందుకు గాను తల్లిదండ్రులు రాజేందర్, నవత ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్‌బెల్ట్ సాధించడానికి చాలా కఠోర శ్రమ చేశాడని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీన్, కుటుంబసభ్యులు ధృవను అభినందించారు.

ప్రైవేటు పాఠశాలకు మెమో జారీ

ముప్కాల్, జూలై 15 : పర్మిషన్ లేకుండా నర్సరీ తరగతులు నిర్వహిస్తున్న కిసాన్‌నగర్ సెయింటెన్స్ స్కూల్‌కు మెమో జారీ చేసినట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పర్మిషన్ లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశారు. దీంతో స్కూల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉమ్మడి బాల్కొండ మండలంలో పర్మిషన్ లేకుండా నడుపుతున్న స్కూళ్ళను మూసివేస్తామని హెచ్చరించారు.

బాల్కొండ పెద్ద చెరువు శిఖం కబ్జాను అరికట్టాలి



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ముప్కాల్, జూలై 15 : బాల్కొండ పెద్ద చెరువు శిఖం కబ్జా నుంచి కాపాడాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయలేదని, సర్వేయర్‌తో సర్వే చేపట్టి చెరువును రక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే పంట అధిక దిగుబడి



మాదాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారిణి

జక్రాన్‌పల్లి, జూలై15: ముదిరిన వరినారు కొనలను తుంచి వేసి నాట్లు వేయడంతో పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారిణి దేవిక అన్నారు. సోమవారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో ముదిరిన వరినారు కొనలు తుంచడంపై అవగాహన సదస్సు క్షేత్రస్థాయిలో నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారిణి దేవిక మాట్లాడుతూ ముదిరిన వరినారు తుంచడం వల్ల మొగిపురుగు రాకుండా నివారణ చేయవచ్చన్నారు. ముదిరిన నారు నాటినట్లయితే తక్కువ దూరంలో ఎక్కువ నారు నాటాలని రైతులకు అవగాహన కల్పించారు. వరి నారు పీకే వారం రోజుల ముందు 3జీ గుళికలు చల్లాలని, దీని వల్ల మొగిలిపురుగు నివారణ చేయవచ్చన్నారు. ఎరువులు మోతాదుకు మించి వాడవద్దన్నారు. అవసరమైన మేరకే ఎరువులను చల్లుకోవాలన్నారు. సరైన సమయంలో మందులు వరి పంటకు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారిణి సంధ్య, రైతు కూలీలు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, జూలై15 :పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నపూర్ణ సాహిత నవనాథునికి గాజులతో అలంకరించారు. ప్రతీ సంవత్సరం అషాఢమాసం రెండో సోమవారం నవనాథునికి గాజులతో అలంకరించి గుట్టపై విచ్చేసిన మహిళా భక్తులకు అందజేస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు. సిద్దులగుట్టపై నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొని భక్తిపాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ప్రతీ సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించే అన్న ప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, ప్రశాంత్‌గౌడ్, చరణ్‌రెడ్డి, బొండ్ల ఆనంద్, ఆలయ అర్చకుడు కుమారశర్మ, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్

ఆర్మూర్‌టౌన్, జూలై 15 : పట్టణంలోని రాంమందిర్ బాలుర హైస్కూల్‌లో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం సీజనల్ వ్యాధు లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ సీజనల్ వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా, జపానీస్ ఎన్‌సెఫలైటిస్ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం కావున సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం రంగచారినగర్, అరుంధతీనగర్‌లో ఇంటింటికి సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుపీహెచ్‌సీ హెచ్‌వో కృష్ణమూర్తి, టి.శంకర్, శాంత, బట్టు ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలం, లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్దన్ సూచించారు. కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కీటకజనీత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాల వర్తింపు

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నందిపేట, జూలై 15 : రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా అర్హులైన లబ్దిదారులకే పథకాలు వర్తిస్తాయని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు చెందిన లబ్దిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పేదల తల్లిదండ్రుల ఆడపిల్లల వివాహాలకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకాలు ఏ కులానికో, మతానికో సంబంధించినవి కావని, నిబంధనల ప్రకారం అర్హులకే అందతుందని తెలిపారు. ఈ పథకాల వలన వరకట్న వేధింపులు తగ్గాయని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేనే షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఆపారని వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఉమ్మడి నందిపేట మండలానికి చెందిన 102 చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు భూతం సాయరెడ్డి, మండల తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్, బీజేపీ నాయకులు ఎలిగేటి రాజు, గాండ్ల నర్సాగౌడ్, కుమ్మరి చిన్నయ్య, గంగాధర్ గౌడ్, రమేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడి టీచర్‌లు

భీమ్‌గల్ రూరల్, జూలై 15 : కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం భీమ్‌గల్ మున్సిపల్ కేంద్రంలోని బంజారా భవన్‌లో షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పెట్టిన కళ్యాణలక్ష్మీ రూ.లక్షతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన తులం బంగారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడున్న లబ్ధిదారులు అప్పులు చేసి పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు చేశారు. వారి తల్లిదండ్రులు వారికి తులం బంగారాం కూడా ఇస్తారనే ఆశతో వచ్చారని, వారు నిరాశతో వెనుదిరిగి వెళ్లారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఇచ్చిన రూ.లక్ష చెక్కుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు అందరికి తులం బంగారం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దొన్‌పాల్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

మోర్తాడ్ : మండలంలోని దొన్‌పాల్ గ్రామంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఆయన మొక్కలను నాటారు. మోర్తాడ్‌లో హరితహరం కార్యక్రమంలో కేసీఆర్ చేపట్టారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. హరితహరం కార్యక్రమం ద్వారా తెలంగాణలో అనుహ్యంగా గ్రీన్ కవరేజీ పెరిగిందని అన్నారు. గతంలో 22శాతం పచ్చదనం ఉండగా నేడు 31శాతానికి పెరిగిందని ఎమ్మెల్యే అన్నారు. మరో రెండు శాతం పెరిగితే తెలంగాణలో మంచి వర్షాలు పడతాయని గ్లోబల్ వర్మింగ్ కట్టడికి అస్కారం ఉందని అన్నారు. మొక్కలు నాటడం, సంరక్షించడం ప్రతీఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. నాటిన మొక్కలు పెరిగేందుకు బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు భవాని శంకర్, రవీంధర్, ఎంపీడీవో తిరుమల, ఏపీవో శంకుతల, ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, చిరంజీవి, రాజేంధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి :మండలంలోని వివిధ గ్రామాలలో కుటుంబసభ్యులను కోల్పోయిన కుటుంబాలను సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడి పరామర్శించారు.. కమ్మర్‌పల్లిలో సంతరాజేశ్వర్‌ను, బీఆర్ నాయకుడు హల్దే శ్రీనివాస్‌ను మాజీ కో-ఆప్షన్ సభ్యులు జాఫర్ హూసేన్ మరణంతో వారి కుటుంబసభ్యులను, తల్లి మరణంతో కోరె రాజన్న కుటుంబసభ్యులను పరామర్శించి 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తండ్రి చిన్నోజి మరణంతో బీఆర్‌నాయకుడు రాజీవ్‌గాంధీ కుటుంబసభ్యులను, కోతులదాడిలో బోడ్డు శంకర్ తల్లిందడ్రులు తీవ్రంగా గాయాలపాలై కోలుకుంటున్నవారిని పరామర్శించారు. హసాకొత్తూర్‌లో జంగం మహేష్‌ను, రాకేష్‌ను, రోడ్డుప్రమాదంలో భార్య ఆకుల తిరుమల, అనారోగ్యంతో తల్లి మరణంతో బషీరాబాద్ గ్రామానికి చెందిన ఆకుల లింగన్న వారి కుటుంబసభ్యులను ప్రశాంత్ రెడ్డి పరమర్శించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడి వెంల మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం రాజేశ్వర్, బద్రి, బద్దం చిన్నారెడ్డి, కోరె నర్సయ్య, గడ్డం శ్రీధర్, విజయ్, కొమ్ముల రాజజేందర్, రాజాగైడ్, మరీష్ రెడ్డి, వేముల శ్రీనివాస్, తదితర బీఆర్‌ఎస్ నాయకులు కార్యక్తలు ఉన్నారు.

వేల్పూర్ : తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం అయ్యేలా చూడాలని సోమవారం వేల్పూర్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని అంగన్‌వాడీ టీచర్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. అం గన్‌వాడీ టీచర్‌ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు ఆధ్వర్యంలో భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి వివిధ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్ళాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని కోరారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో రాళ్లు



బియ్యంలో వచ్చిన రాళ్లు

నవీపేట, జూలై 15 : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించి సరఫరా అయిన బియ్యంలో అధిక మొత్తంలో రాళ్లు వస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా కాగా అందులో రాళ్లు, మెరిగెలతో పాటు ఎలుకలకు సంబంధించిన వ్యర్థాలు బయట పడుతున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. మధ్యాహ్నభోజన సమయంలో బియ్యంలో రాళ్లు, మెరిగెలను ఏరివేసి వండుతున్నప్పటికీ అక్కడక్కడ విద్యార్థులకు వండిన అన్నంలో రాళ్లు వస్తున్నాయని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈవో గణేష్‌రావును వివరణ కోరగా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యంలో రాళ్లు, మెరిగెలు వస్తున్నాయనే విషయం తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత బియ్యాన్ని వాపసు పంపిస్తున్నామన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయలు



తీవ్రంగా గాయపడిన నవీన్

నవీపేట, జూలై 15 : మండలంలోని ధర్మారం మూలమలుపు సమీపంలో సోమవారం బైక్ అదుపుతప్పి కింద పడడంతో తండ్రీ కూతురుకు గాయాలయ్యాయి. నవీన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, అతని 10 సంవత్సరాల కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన నవీన్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని, ఉదయం 9:30గంటల సమయంలో బైక్‌పై తన కూతురును వెంట తీసుకుని వెళ్తుండగా అబ్బాపూర్(ఎం) దాటిన తర్వాత ధర్మారం మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా అతని కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయని వారు పేర్కొన్నారు. బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ బైక్ వేగంగా ఉండడంతో అతని తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు



పడిగెలలో విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న సభ్యులు

వేల్పూర్, జూలై 15 : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ యువనైపుణ్య దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థులు రెండు గ్రూప్‌లుగా వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువు ఒక్కటే కాకుండా అదనంగా వివిధ అంశాల్లో నైపుణ్యం సంపాదించుకోవాలని సూచించారు. రెండు విభాగాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, హెచ్ఎం రాంచందర్, కోశాధికారి నారాయణగౌడ్, ప్రాజెక్టు ఛైర్మన్ అంబల్ల తిరుపతి, కో-ప్రాజెక్టు ఛైర్మన్‌చావుల పాల్గొన్నారు.

రుద్రూరు : మండల కేంద్రంలోని అంబం (ఆర్) గ్రామశివారులో గల ఆదర్శపాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజం చైతన్యం కోసం విద్యార్థి ని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత నైపుణ్యాలను పెంచుకుని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. ర్యాలీలో కళాశాల అధ్యాపకులు దుర్గాప్రసాద్, శ్రావణి, సతీష్, డాక్టర్ శివకృష్ణ, రమేష్, కుల్దీప్‌సింగ్, పీడీ రవి, మౌనిక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మానవ మనుగడకు నైపుణ్యాలు ఎంతో ముఖ్యమని మన జీవన ప్రమాణాల ఇవీ ఎంతగానో ఉపయోగపడుతాయని జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలోని ప్రపంచ జాతీయ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిది



మొక్కలు నాటుతున్న పోలీసులు

బోధన్‌రూరల్, జూలై 15 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. సోమవారం బోధన్ మండలంలోని మందర్నా గ్రామంలో ప్రతి ఇంటికి చెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఖాళీస్థలాల్లో 200 చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రావుబా గంగాధర్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఏరాజ్‌పల్లి తదితర గ్రామాలలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు.

'ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

బోధన్‌రూరల్, జూలె 15 : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపర్చాలని, ఇచ్చిన వాగ్దానాలు పూర్తయ్యేవరకు ఉద్యమించాలని ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద గల పాన్‌గల్లీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేంత వరకు ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, బీడీ కార్మికులకు పింఛన్‌లు, కొత్త రుణాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదిన మహలక్ష్మి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ఉంటుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు సాయిలు, పోశెట్టి, గంగారాం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి ఒకరోజు జైలు

బోధన్‌రూరల్, జూలై15 : వాహనాలను మద్యం సేవించి నడపవద్దని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సోమవారం బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శేషాతల్ప సాయి మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 1500రూపాయల జరిమానతో పాటు ఒకరోజు జైలుశిక్షను విధించినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. అనంతరం 11 మంది పేకాట రాయుళ్లకు 27,500 రూపాయల జరిమాన విధించినట్లు ఆయన తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల ఏర్పాట్లపై పరిశీలన

బోధన్‌రూరల్,జూలై15: బోధన్ పట్టణంలోని రాకాసిపేటలోని స్టేషన్‌లో సోమవారం రైల్వేశాఖ అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో వసతుల ఏర్పాట్లపై ఆవరణను పరిశీలించారు. అనంతరం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను బోధన్ నుంచే ప్రారంభించాలని విద్యార్థి సంఘాల నాయకులు మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించడం జరిగిందని, పూర్తినివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. బోధన్ నుంచి రాయలసీమకు రైలు సౌకర్యం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. త్వరలోనే బోధన్‌వాసుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆయన వెంట రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించిన ఎంపీడీవో

రెంజల్,జూలై15: మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో పనులు చేపడుతుందని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు మొదలై నెలలు గడుస్తున్నా పనులలో జాప్యం చేయడం సమంజసం కాదని సూచించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ రాజయ్య, ఏఈ వినయ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్‌లో నర్సరీని సందర్శించిన ఎంపీడీవో

రెంజల్,జూలై15: మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల నర్సరీని సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో రమణతో కలిసి సందర్శించారు. నర్సరీలోని మొక్కలను సంరక్షించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో ఐదుమొక్కలను నాటాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండగ

ఏర్గట్ల, జులై 15: మండల కేంద్రంలో సోమవారం హిందూ ముస్లీంలు పీర్ల పండగలను భక్తి శ్రద్ధతో జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట పీర్లను ఊరేగించగా భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను ఎత్తుకొని డప్పుచప్పుల్లతో దూలా ఆడారు. కార్యక్రమంలో గ్రామంలోని ముస్లీంలతో పాటు హిందువులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలోకి చేరిక

ఏర్గట్ల, జులై 15 : పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సమక్షంలో సోమవారం మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. మాజీ ఉపసర్పంచ్ దేశబోయిన సంజీవ్ యాదవ్, ఎర్రాజీ ప్రవీణ్, పడాల మహేష్‌తో పాటు పలువురికి ఎంపీ అర్వింద్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమ రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ బొల్లిశంకర్, బద్ధం సురేష్ రెడ్డి, సోమనరేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్, జూలై 15 : మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలోని చెరువులో సోమవారం ఉదయం మృతదేహం లభించినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జాడి జమాల్‌పూర్ గ్రామానికి చెందిన వన్నెల వెంకటేష్ (31) అనే వ్యక్తి శనివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం ఉందని గ్రామస్థులు తెలుపగా వెళ్లి చూడగా మృతదేహం తమ కుమారుడిదేనని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వెంకటేష్ 9సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, అప్పుడే విడాకులు అయ్యాయని, అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడని కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం

ముప్కాల్, జూలై15 : మండలంలోని వేంపల్లి గ్రామంలో ఆదివారం ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సాంబారు లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్ళడంతో ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులను ఆయనను శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. సాంబారు నారాయణ గత 11ఏండ్లుగా తమ సేవలను పాఠశాలకు అందించి ఎంతో మంది విద్యార్థులను గురుకుల పాఠశాలలకు పంపించే విధంగా కృషిచేశారని, ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్మూర్ మండలం రాంపూర్ పాఠశాలలకు బదిలీపై వెళ్ళారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ రామకృష్ణ యాదవ్, మాజీసర్పంచ్ బార్ల అంజయ్య, గణేష్, సుమన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్; సతీష్, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, విద్య కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఈరవత్రి అనిల్‌ను కలిసిన జిల్లా మైనార్టీ వర్కింగ్ ఛైర్మన్

కమ్మర్‌పల్లి, జూలై 15: తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌ను జిల్లా మైనార్టీ వర్కింగ్ ఛైర్మన్ అబ్దుల్ రఫీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాలమోహన్ రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఛైర్మన్‌లను కలిసిన వారిలో జిల్లాకు చెందిన వివిధ మండలాల మైనార్టీ నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలి

• ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీల ఆందోళన • డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేత


ఎమ్మెల్యే పోచారానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తూ..


అంగన్‌వాడీలతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్, జూలై 15: అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలంటూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జుక్కల్ అంగన్‌వాడీ కార్యకర్తలు జుక్కల్ మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ మాట్లాడుతూ జీవో నెంబర్ 10 రద్దు చేయడంతో పాటు అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచాలని డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేల చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు అన్ని రకాల బెనిఫిట్లను అందజేయాలని కోరారు. అంగన్‌వాడీల బలోపేతానికి బడ్జెట్‌లో నిధులు పెంచి కేంద్రాలను బలోపేతం చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు, కారుణ్య నియామకాలు చేపట్టాలని, జీవో నెంబర్ 14తో పాటు 8ని సవరించాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్న నాయకులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు అనసూయ, సచిత, రాధ, అనురాధ, వజ్ర, రోజా, సుమలత, బుజ్జిబాయి, విజయ, శోభ, శారద, నర్సవ్వ, విజయ, కమల పాల్గొన్నారు.

• ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

ఎల్లారెడ్డి: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యాలయం వద్దకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే అంగన్‌వాడీల టీచర్లు ఆయాలతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీఇవ్వడంతో అంగన్‌వాడీలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీలు ఆయాలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు గోపీకృష్ణ, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

బాన్సువాడ: అంగన్‌వాడీల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అంగన్‌వాడీ ఉద్యోగులు, సహాయకులు ర్యాలీగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి చేరుకుని ఎమ్మెల్యే పోచారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష వర్తింపజేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు మహాదేవి, శివలింగ, రేణుక, సరిత, అంగన్‌వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించాలి

• 14 ఏళ్ల బాల బాలికలు పనిలో ఉండొద్దు • బడికి రాని విద్యార్థులపై దృష్టి పెట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డిటౌన్, జూలై15: జిల్లాలో బాల కార్మికులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం చైల్డ్‌లేబర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ఏళ్ల లోపు వారు ఏ పని ప్రదేశంలో పని చేయకూడదని, ఇలాంటి వారిని గుర్తించి చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. 15 నుంచి 18 ఏళ్లవారు పని చేస్తున్నటువంటి కౌమర కార్మికులు ప్రమాదభరిత ప్రదేశాలల్లో పనిచేస్తున్నట్లయితే వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖను, పోలీసుశాఖను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి పిల్లల హాజరుశాతాన్ని గమనిస్తుండాలని, ఒకవేళ ఒక విద్యార్థి బడికి వరుసగా హాజరుకానట్టయితే అందుకు గల వివరాలను డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు తెలియజేస్తూ దానిమీద తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. వారు ఎందుకు బడికి రావట్లేదో తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవోరాజు, డీసీపీఓ స్రవంతి, కోటేశ్వర్లు, సహాయ కార్మిక కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్ల జేఏసీ సభ్యులు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డిటౌన్, జూలై 15: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర ప్రతినిధి వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల సమస్యలను పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, అందుకు పెన్షనర్ల జేఏసీని చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 9 ప్రధాన డిమాండ్లను, 4 డీఏలను చెల్లించాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని, నగదురహిత చికిత్సకు అనుమతించాలని, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటుచేయాలని, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటుచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ హన్మంత్‌రెడ్డి, లచ్చయ్య, గంగారెడ్డి, నరసింహరెడ్డి, అంజయ్య, రమణ, విజయరామరాజు, శ్రీశైలం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మద్నూర్, జూలై15: మండలంలోని ధోతి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వాటితోపాటు కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కంటిఅద్దాలను ఉచితంగా అందజేశారు. శస్త్రచికిత్స అవసరం ఉన్న వారికి ఎంపిక చేసి బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కంటి పరీక్షల్లో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 20మందికి శస్త్రచికిత్సలు అవసరం ఉన్నాయని వైద్యులు ప్రశాంత్ తెలిపారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, గ్రామ పెద్దలు హనుమంతరావు, శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాసమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి'

మద్నూర్, జూలై15: ప్రజాసమస్యల పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తోందని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ అన్నారు. సోమవారం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజలు ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు ఉంటే ఫిర్యాదుచేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారిణి సునంద, ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జంగంపల్లి బీజేపీ కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు, జూలై15: మండలంలోని జంగంపల్లి బీజేపీశాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి నరేందర్, ఉపాధ్యక్షులుగా సార్ల మహేష్, నిమ్మల నరేష్, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణం, సహాయకార్యదర్శిగా చెన్న ప్రసాద్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనఅధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ బీజేపీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆగ్రో చైర్మన్‌కు ఘన సన్మానం

నిజాంసాగర్, జూలై 15: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సోమవారం బాన్సువాడకు రావడంతో నిజాంసాగర్ అతిథిగృహంలో నిజాంసాగర్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


ఆగ్రో చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి'

గాంధారి, జూలై 15: ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు సోమవారం తహసీల్దార్ సతీష్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని సూచించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని సీఎం అమలుచేయాలని అన్నారు. ఈనెల 15 నుంచి 27వరకు రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. జీవోనెంబర్ 6 ప్రకారం చెరువుకుంటల మత్స్యసంపదపై ముదిరాజ్‌లకు గంగపుత్రులకు, గుండ్ల కులాలకు మాత్రమే ఉండేలా చట్టపరమైన ఆదేశాలు జారీచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తూర్పురాజు, సంఘాని బాలయ్య, రాజు,గంగాధర్, బాబా, తదితరులున్నారు.

'డీటీపై అట్రాసిటీ కేసు నమోదుచేయాలి'

కామారెడ్డి టౌన్, జూలై15: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డీటీ వెంకటేష్‌పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం తాడ్వాయి మండలకేంద్రంలో మాట్లాడుతూ తాడ్వాయి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తెడ్డు ప్రశాంత్ ఆత్మహత్యకు కారణమైన డిప్యూటీ తహసీల్దార్‌ను శిక్షించాలని డిమాండ్‌చేశారు. ప్రశాంత్‌ను ప్రతీ రోజు డీటీ వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఓ దళితుడు అయినందునే డీటీ ఇలా వ్యవహరించాలని మండిపడ్డారు. దళితులు ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించడం నేరమా అని ప్రశ్నించారు. వెంకటేష్‌ను అరెస్ట్ చేయకుంటే మరిన్ని ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్రమాజీ కార్యదర్శి వెంకటరాములు, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీనాయకులు లావణ్య, మానస,రాజనర్సు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తుల పూజలు

బాన్సువాడ టౌన్, జూలై 15: పట్టణంలోని సంగమేశ్వర, ఒట్లం పరమేశ్వరాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేకపూజలు చేపట్టారు. ఆలయఅర్చకులు ఉదయం నుంచి శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని శివలింగాలను దర్శించుకున్నారు.


తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాన్ని విడుదల చేస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సదాశివనగర్, జూలై15: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి అస్మా, ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. గ్రామాలలో వర్షపు నీరు నిలిచిపోకుండా, లీకేజీల మరమ్మతులు, నీరు కలుషితం కాకుండా చూసేందుకు, తాగునీటి నమూనా పరీక్ష, చెత్తను ఖాళీ చేసేందుకు కార్యదర్శులకు ముఖ్యమైన మార్గదర్శకాలు సూచించారు. తక్షణ నివేదిక, జ్వరం కేసులు పీహెచ్‌సీకి రిఫరల్ ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో విరేచనలు సంభవించినట్లయితే వెంటనే నివేదించాలని సలహా ఇచ్చారు. ప్రతీ గ్రామంలో ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతను కాపాడేందుకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్‌రెడ్డి, సీహెచ్‌వో నాగరాజు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

భిక్కనూరు, జూలై 15: భిక్కనూరు గ్రామ పంచాయతీ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సహకరించాలని భిక్కనూరు అఖిలపక్షం నాయకులు కోరారు. సోమవారం భిక్కనూరు గ్రామ పంచాయతీలో అఖిలపక్షం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గత పాలకవర్గం ఆధ్వర్యంలోనే అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు తీర్మానం చేసినా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సాధ్యపడలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసినందున విగ్రహ ఏర్పాటుకు తమతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నిజాంసాగర్, జూలై 15 :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు బదిలీపై వెళుతుండటంతో సోమవారం సన్మానం చేశారు. సత్య భూషణ్, సరితా రాణి, గీతలకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పాఠశాల విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట రమణ, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, సంతోష్, జావీద్, లాల్‌సింగ్, తదితరులున్నారు.

'ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలి'

భిక్కనూరు, జూలై15: భిక్కనూరు గ్రామశివారులో బోదర కాల్వను కబ్జాచేసిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి సోమవారం ప్రజావాణి తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. నీరుపారే బోదర కాల్వను ఎంఎస్ఎన్ కంపెనీ కబ్జా చేసిందని, అధికారులు స్పందించాలని, లేనియెడల పెద్దఎత్తున ఆందోళన తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు త్వరలోనే ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువకులు కర్రోల రాజు, గోసుస్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'చాముండేశ్వరి దేవి బోనాల పండగకు హాజరుకావాలి'


షబ్బీర్‌అలీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామ పెద్దలు

దోమకొండ, జూలై 15: మండల కేంద్రంలోని చాముండేశ్వరి దేవిబోనాల పండుగకు హాజరుకావాలని సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డిలను వేర్వేరుగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలసి దోమకొండకు చెందిన పలువురు గ్రామపెద్దలు ఆహ్వాన పత్రికను అందజేశారు. అమ్మవారికి బోనాల సమర్పణ, పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తీగల తిర్మల్‌గౌడ్, అనంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్,సీతారాం మధు, శ్రీనివాస్, సిద్దారెడ్డి, శంకర్‌రెడ్డి, మదుసుధన్‌రెడ్డి ఉన్నారు.


ఆసుపత్రిని పరిశీలిస్తున్న కాయ కల్ప బృందం

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

ఎల్లారెడ్డి, జూలై15: ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం కాయకల్ప బృందం పరిశీలించింది. ఆసుపత్రిలోని వసతులు పరిశుభ్రత స్పెషాలిటీ సేవలు గురించివిచారించారు. రికార్డులను పరిశీలించి ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. కాయకల్ప స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమర్‌సింగ్, శ్రీకాంత్, రాజు, శ్రీదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

కామారెడ్డిటౌన్, జూలై15: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్ అన్నారు. సోమవారం దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ జనాభా విద్యావిభాగం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోస్టర్ మేకింగ్ కాంపిటిషన్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతీ సంవత్సరం ఎస్‌సీఈఆర్‌టీ జానపద కళా ఉత్సవం, పెయింటింగ్, నాటకపోటీలు, పోస్టర్‌మేకింగ్ తదితర పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడానికి కృషిచేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్నిరకాల పోటీల్లో పాల్గొనేలా ప్రేరేపించాలని తెలిపారు. పోస్టర్ మేకింగ్ పోటీ లలోప్రథమ బహుమతిని గెలిచిన దేవునిపల్లి పాఠశాలకు చెందిన సాయిచరణ్, పల్వంచ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అలేఖ్య, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని లహరి తృతీయ బహుమతి గెలుపొందారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ నోడల్ అధికారి గంగాకిషన్, మణిచందన, సురేష్, శ్రీనివాస్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

పెద్దకొడప్‌గల్, జూలై15: విద్యార్థుల ఉద్యమాన్ని అరెస్టులతో ఆపలేరని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో డీఎస్సీ అభ్యర్థులు చేపట్టిన ఉద్యమానికి జిల్లా నుంచి వెళ్తున్న తనను జుక్కల్ పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం ప్రభుత్వం చేతగాని తనమని అన్నారు. ఈ వైఖరిని ప్రభుత్వం మానుకోకుంటే ఉద్యమ తీవ్రతరం చేస్తామన్నారు.

రైతు కల్లాల నిర్మాణానికి ముందడుగు

కామారెడ్డిటౌన్, జూలై15: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గ్రామగ్రామన ఏర్పాటుచేస్తామనే రైతుకల్లాల నిర్మాణానికి ముందడుగు పడిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పల్వంచమండలం ఆరేపల్లి గ్రామశివారులో ఏర్పాటు చేస్తున్న ప్లాంటు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి అభివృద్ధి కోసం తన సొంత రూ.150కోట్ల నిధులతో అభివృద్ధిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగా తీర్మానాలు అందజేసిన ప్రతీ గ్రామంలో కల్లాల నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. వచ్చేవానకాలం కోతల సమయం వరకు సాధ్యమైనన్ని కల్లా నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తేలు శ్రీనివాస్, విపుల్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అనిల్, సురేష్, శ్రీధర్, రంజిత్, శ్రీనివాస్, నాయకులు చారి, రవీందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నిజాంసాగర్, జూలై15: మండలంలోని కస్తూర్బా విద్యాలయం, సుల్తాన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారంనిజాంసాగర్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంచందర్ సందర్శించారు. సుల్తాన్ నగర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టికలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా రూ. 12 లక్షలు మంజూరు కాగా ఈ నిధులతో పనులు చేపట్టాలని ప్రత్యేకాధికారి సరోజనను సూచించారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

మాస్‌క్లీనింగ్ పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, జూలై 15: పట్టణంలోని 37వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న మాస్‌క్లీనింగ్ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20మంది కార్మికుల బృందంతో రోడ్లను, మురికికాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవస్థలను దూరం చేస్తూ పారిశుధ్య పనులను అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని తెలిపారు. జోన్-1, 2గా మాస్‌క్లీనింగ్ కొరకు పెట్టడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాతశివకృష్ణమూర్తి,అధికారులు పాల్గొన్నారు.


శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- కల్కి
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- భారతీయుడు-2

బాన్సువాడ

మహేశ్వరి	- భారతీయుడు-2
వెంకటేశ్వర	- మహారాజ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

